అమెరికా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలి

- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికా అండదండలతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేసి శాంతి నెలకొల్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. వరంగల్ నగరంలోని సిపిఎం కార్యాలయంలో పార్టీ జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. అమెరికా అండతో పాలస్తీనాను ఇజ్రాయిల్ ఆక్రమించేందుకు ప్రయత్నిస్తోందని, ఇరాన్‌పై దాడి చేసి పసి పిల్లలు, మహిళలు, వృద్ధులు అని చూడకుండా చంపేస్తూ ఉన్మాదంతో వ్యవహరిస్తోందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజలు నిలబడాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందని, దాని ఫలితంగా దేశంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. పహల్గాం ఉగ్రవాదులను పట్టుకునేలా అంతర్జాతీయంగా ఒత్తిడి చేయాలని, ఆ వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందన్నారు. మావోయిస్టులను అణచేస్తామని ప్రకటించి ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులను, మావోయిస్టులను దారుణంగా చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలన్నారు. కార్మికుల శ్రమను దోపిడీ చేసే విధంగా పని గంటలు పెంచుతూ యజమాన్యాలకు, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మోడీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని తెలిపారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. వరంగల్ నగరంలో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలందరికీ పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగయ్య, జిల్లా కమిటీ నాయకులు సింగారపు బాబు, నలిగటి రత్నమాల, ఇసంపల్లి బాబు, భూక్య సమ్మయ్య, కోరబోయిన కుమారస్వామి, బొల్ల సాంబయ్య, శ్రీధర్, మధుకర్, యారా ప్రశాంత్, వనదాసు దుర్గయ్య ఉన్నారు.

పైసల దందా వల్లే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టు

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పైసల దందా వల్లే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్ అయ్యారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ చెప్పారు. ప్రజా సమస్యలపై ఆయన ఎప్పుడైనా ఉద్యమం చేశారా? అని ప్రశ్నించారు. ఆయన అరెస్టును సిగ్గు లేకుండా మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఖండిస్తున్నారని విమర్శించారు. ఒక దొంగకు వారు మద్దతు తెలుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు డాక్టర్ లింగం గౌడ్, చరణ్‌కౌశిక్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పైసల కోసం క్రషర్ యజమానులను బ్లాక్ మెయిల్ చేసిన కారణంగా ఆయన్ను అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎట్లా అయితే దొంగలను బయట దేశాలకు పంపిస్తున్నారో...కౌశిక్‌రెడ్డిని కూడా దేశం దాటించేందుకు బీఆర్ఎస్ నేతలు చూశారని తెలిపారు. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ కౌశిక్‌రెడ్డి పైసలు తీసుకున్నారని ఆరోపించారు. తాము చేసిన దొంగతనాలు ఎక్కడ బయట పడతాయనే ఆందోళనతో కేటీఆర్, హరీశ్‌రావు బనకచర్ల విషయంలో ముందుగానే మాట్లాడుతున్నారని విమర్శించారు. ఆ విషయంలో ఆనాటి సీఎం జగన్మోహన్‌రెడ్డితో లోపాయికారి ఒప్పందాలు చేసుకుంది మీరు కాదా? అని ప్రశ్నించారు.

ఫిజిక్స్ వాలాతో ఒప్పందాన్ని వెనక్కి తీసు కోవాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (కెజిబివి)ల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా జెఇఇ, నీట్, క్లాట్ కోచింగ్ ఇవ్వాలని నిర్ణయించడం హర్షించదగ్గ విషయమని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజినీకాంత్, కార్యదర్శి టి నాగరాజు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే, ఈ కోచింగ్‌ను కార్పొరేట్ ఎడ్యుటెక్ సంస్థ "ఫిజిక్స్ వాలా"తో తెలంగాణ అబివృద్ధి 2025 కోసం చేసిన ఒప్పందాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే ఉచితంగా నాణ్యమైన కోచింగ్‌ను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యాపార దృక్పథంతో పనిచేస్తున్న "ఫిజిక్స్ వాలా" వంటి సంస్థలతో కాకుండా ప్రభుత్వమే ఉచితంగా నాణ్యమైన కోచింగ్‌ను ఇవ్వాలని సూచించారు.



రాష్ట్రంలో "రియల్ బూమ్"

- నిర్మాణ రంగంలో 11.97 శాతం పెరుగుదల
- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం భారీ వృద్ధిని నమోదు చేసుకుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. గతేడాది కన్నా రియల్ ఎస్టేట్ రంగం తగ్గిందంటూ కొందరూ కావాలనే పనిగట్టుకొని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో "టైమ్స్ హోమ్ హంట్ ప్రాపర్టీ ఎక్స్ పో 2025"ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "2024- 25 ఆర్థిక సంవత్సరంలో రియల్ ఎస్టేట్ ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలో 15.4 శాతం వృద్ధి రేటు నమోదయ్యింది. నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి చెందింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం రూ.80వేల కోట్లు సమకూర్చింది. తెలంగాణ సర్వీసెస్ ఎకానమీలో ఈ రియల్ వాటా 24.9 శాతం. ప్రస్తుతం రెరా దగ్గర 9,744 రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు రిజిస్టర్ అయ్యాయి. ఇవి గణాంకాలు కాదు... మా హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి చెంప దెబ్బ" అని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఒక్క హైదరాబాద్ లోనే 5,900 ఇండ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయని గుర్తు చేశారు. మొత్తం రిజిస్ట్రేషన్లలో రూ.కోటి, అంత కంటే ఎక్కువ ధర గల ఇండ్ల వాటా 18 శాతంగా ఉందని చెప్పారు. ఈ తరహా ఇండ్ల కొనుగోళ్లలో వార్షిక వృద్ధి రేటు 58 శాతంగా నమోదు అయ్యిందని నైట్ ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది" అని మంత్రి పేర్కొన్నారు. "రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న నిర్మాణ రంగం అభివృద్ధికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిస్తున్నాం. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన అత్యుత్తమ నైపుణ్య మానవ వనరులను తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. ఈ రంగానికి సర్కార్ తోడ్పాటునందిస్తుందని రియల్టర్లకు ఈ సందర్భంగా మంత్రి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అరికపూడి గాంధీ, గంద్ర సత్యనారాయణ రావు, క్రెడాయ్ అధ్యక్షులు జైదీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

ఎడ్‌సెట్‌లో 30,944 మంది ఉత్తీర్ణత

- డిగ్రీ ఫలితాలు విడుదలయ్యాక కౌన్సెలింగ్
- 208 బిఎడ్ కాలేజీల్లో 18,550 సీట్లు
- ఉన్నత విద్యామండలి చైర్మన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిఎడ్ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఈ నెల ఒకటో తేదీన నిర్వహించిన ఎడ్‌సెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ వి బాలకిష్టారెడ్డి, కెయు విసి కె ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎడ్‌సెట్ రాతపరీక్షకు 38,758 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారనీ, వారిలో 32,106 మంది హాజరయ్యారని వివరించారు. హాజరైన వారిలో 30,944 (96.38 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. 7,217 మంది అబ్బాయిలు దరఖాస్తు చేస్తే, 5,801 మంది పరీక్ష రాశారనీ, వారిలో 5,723 (98.66 శాతం) మంది అర్హత సాధించారని అన్నారు. 31,536 మంది అమ్మాయిలు దరఖాస్తు చేయగా, 26,304 మంది పరీక్షకు హాజరయ్యారనీ, వారిలో 25,220 (95.88 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఈ సందర్భంగా విలేకర్లు అడిగిన పలు ప్రశ్నలకు వారు సమాధానమిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ఏడు ప్రభుత్వ, 201 ప్రయివేటు బీఎడ్ కాలేజీలు కలిపి 208 కాలేజీల్లో 18,550 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. గత విద్యాసంవత్సరంలో కన్వీనర్ కోటాలో 9,144 మంది, యాజమాన్య కోటాలో 5,276 మంది కలిపి మొత్తం 14,420 మంది చేరారని చెప్పారు. అబ్బాయిల కంటే అమ్మాయిలు ఎక్కువగా బీఎడ్‌కు ముఖ్యంగా ఉన్నత విద్యకు రావడం సంతోషకరమని అన్నారు. ఇది మహిళా సాధికారతకు దోహదపడుతుందని వివరించారు. మహిళలు ఉన్నత విద్యను అభ్యసిస్తే కుటుంబాలు బాగుపడతాయని చెప్పారు. డిగ్రీ ఫలితాలు విడుదలయ్యాక ఎడ్‌సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌పై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్లు ఇటిక్యాల పురుషోత్తం, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, ఎడ్‌సెట్ కన్వీనర్ బి వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ వాసి గణపతిశాస్త్రి టాపర్

హైదరాబాద్‌కు చెందిన వజ్జ గణపతి శాస్త్రి ఎడ్‌సెట్ టాపర్‌గా నిలిచారు. సికింద్రాబాద్‌కు చెందిన గర్రెపెల్లి శరత్‌చందర్ రెండో ర్యాంకు, వరంగల్‌కు చెందిన కౌదగని నాగరాజు మూడో ర్యాంకు, సికింద్రాబాద్‌కు చెందిన శారద పోలెపెద్ది నాలుగో ర్యాంకు, అనగంటి నిఖిత ఐదో ర్యాంకు, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన జర్పాల శివజ్ఞాని ఆరో ర్యాంకు, నాగర్‌కర్నూల్‌కు చెందిన పులిగిల్ల రాము ఏడో ర్యాంకు, నల్లగొండకు చెందిన బోధనం ప్రణవి ఎనిమిదో ర్యాంకు, జగిత్యాలకు చెందిన జవ్వాజి శివ నాగేశ్వర్ తొమ్మిదో ర్యాంకు, సంగారెడ్డికి చెందిన నర్రి సాయికుమార్ పదో ర్యాంకును సాధించారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్.. బెయిల్ మంజూరు


కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రానైట్ క్వారీ యజమానిని బెదిరించిన కేసులో అరెస్టు అయిన హుజురాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి ఊరట లభించింది. కాజీపేట రైల్వే న్యాయస్థానం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. సుబేదారి పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేసి హన్మకొండకు తరలించారు. శనివారం ఉదయం నుంచి సుబేదారి పోలీసు స్టేషన్‌లోనే ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని ఉంచారు. అనంతరం కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపర్చగా.. వాదోపవాదాల అనంతరం కోర్టు ముందుగా రిమాండ్ విధించి.. ఆ తర్వాత షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అంతకు ముందు ఉదయం బీఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి తదితరులు పోలీసుస్టేషన్‌కు వచ్చి 'పాడి'ని కలిసి సంఘీభావం ప్రకటించారు. రెండు నెలల కిందట గ్రానైట్ వ్యాపారి కట్టా మనోజ్‌రెడ్డిని రూ.50 లక్షలు ఇవ్వాలంటూ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బెదిరించారని మనోజ్ సతీమణి సుబేదారి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో సుబేదారి పోలీసులు ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై 308(2), (4), 352 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. సుబేదారి పోలీసు స్టేషన్ నుంచి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని వరంగల్ ఎంజిఎం ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం ఆయనను కాజీపేట రైల్వే కోర్టులో హాజరుపరిచారు.

సిఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం

సుబేదారి పోలీసుస్టేషన్ ముందు బీఆర్ఎస్ నాయకులు సిఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆకస్మికంగా కారులో నుంచి దింపి దహనం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను చెదరగొట్టారు. పలువురు కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

కేసులకు భయపడే ప్రసక్తే లేదు :కౌశిక్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ, సిఎం రేవంత్‌రెడ్డి తనపై ఎన్ని అక్రమ కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదు.. తనపై ఎన్ని కేసులు పెడితే అంత బలంగా తయారవుతా.. రేవంత్ రెడ్డితోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకుల బాగోతాలు బయట పెడతానని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. హనుమకొండ జిల్లా సుబేదారి పోలీసు స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేయగా షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. చివరికి న్యాయం గెలిచిందని తెలిపారు.

క్రెడాయ్ నూతన అధ్యక్షుడిగా జైదీప్ రెడ్డి

- హైదరాబాద్ కమిటీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్ 2025 -2027 సంవత్సరానికి నూతన మేనేజింగ్ కమిటీని ఆ సంస్థ ప్రకటించింది. హైదరాబాద్‌లో క్రెడాయ్ కార్యక్రమాలను ముందుకు నడిపించడం, బలోపేతం చేయడం, రంగం అభివృద్ధికి కృషి చేయడం వంటి బాధ్యతలను నిర్వర్తిస్తారని క్రెడాయ్ కమీటి వెల్లడించింది. క్రెడాయ్ హైదరాబాద్ నూతన అధ్యక్షుడిగా ఎన్.జైదీప్ రెడ్డి ఎన్నికయ్యారు. ఇంతక్రితం ఈ హోదాలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి నుంచి జైదీప్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ప్రెసిడెంట్-ఎలెక్ట్‌గా బి.జగన్నాథరావు, జనరల్ సెక్రటరీగా క్రాంతి కిరణ్ రెడ్డి, కోశాధికారిగా గూడూర్ నితీష్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా మనోజ్ కుమార్ అగర్వాల్, కుర్రా శ్రీనాథ్, కె.అనిల్ రెడ్డి, వై.రవిప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా సంజయ్ కుమార్ బన్సాల్, ముసునూరు శ్రీరామ్ బాధ్యతలను స్వీకరించారు. కార్యనిర్వాహక కమిటీ సభ్యులు అడ్డుల గోపాల్ రెడ్డి, అలుగుబెల్లి వెంకట్ రెడ్డి, బి జైపాల్ ఎన్నికయ్యారు. క్రెడాయ్ ప్రస్థానంలో తొలిసారిగా కార్యవర్గంలో మహిళకు అవకాశం కల్పిస్తూ కావ్య కావూరిని ఎగ్జిక్యూటివ్ సభ్యురాలిగా తీసుకున్నారు.

రెరా అనుమతులు తప్పక చూసుకోవాలి : జైదీప్ రెడ్డి

సరైన ఆధారాలు ఉన్న స్థలాలు మాత్రమే కొనుగోలు చేయాలని నూతన అధ్యక్షుడు జైదీప్ రెడ్డి వినియోగదారులకు సూచించారు. వీటికి రెరా అనుమతులు తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్త వహించాలని, ప్రీలాంచ్‌లు, ఆఫర్‌లను నమ్మెద్దన్నారు. గృహ కొనుగోలుదారులకు నమ్మకం, పారదర్శకత, సకాలంలో డెలివరీ ఇవ్వడం ద్వారా క్రెడాయ్ పని తీరు మెరగవుతుందని పేర్కొన్నారు. అందరి సహకారంతో రియల్ ఎస్టేట్ రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు ఉత్సుకతతో ఎదురు చూస్తున్నామన్నారు. ఈ రంగంలో ఉన్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం, వాటి పరిష్కారాలను కనుగొనే బాధ్యత తమపై ఉందన్నారు. తెలంగాణలో రియాల్టీ పరిస్థితి సానుకూలంగానే ఉందని క్రెడాయ్ నేషనల్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ జి రామిరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలు, చేపట్టబోయే ప్రాజెక్టులతో ఏడాదిలోగా ఈ రంగం మరింత పుంజుకొనే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ప్రముఖులు సి శేఖర్ రెడ్డి, బి జగన్నాథరావు, మనోజ్‌కుమార్ అగర్వాల్, క్రాంతి కిరణ్‌రెడ్డి, నితీశ్‌రెడ్డి, సంజయ్‌కుమార్ బన్సాల్, ప్రేమ్‌సాగర్ రెడ్డి, జి.రామిరెడ్డి, ఎస్.రామ్‌రెడ్డి, జి.యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన

- మంత్రి పొన్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బోనాల ఉత్సవాల సందర్భంగా ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బిసి చేతివృత్తుల కళాకారుచేత తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శనను నిర్వహించనున్నట్టు ఆ శాఖ శనివారం ఒక ప్రకటలో తెలిపింది. ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం పక్కన స్థలంలో ఈ ప్రదర్శనను నిర్వహించనున్నారు.

సెంట్రల్ బ్యాంక్‌లో యోగా దినోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ ఆఫీసు, హైదరాబాద్‌లో శనివారం యోగా అంతర్జాతీయ 11వ దినోత్సవం నిర్వహించారు. దీనికి జోనల్ హెడ్ దారాసింగ్ నాయక్ ప్రత్యేక అతిథిగా హాజరు కాగా.. ఇన్‌స్ట్రక్టర్ కెఎన్ పతి, ఆ బ్యాంక్ రీజినల్ హెడ్ దిలీప్ భరన్‌వాల్, ఇతర అధికారులు, ఉద్యోగులు హాజరై ఉత్సాహంగా యోగా చేశారు.

సొంతింటి కల సాకారంలో బ్యాంకర్ల పాత్ర కీలకం

- రుణాలిచ్చే ముందు అన్నీ సరిచూసుకోవాలి
- హైడ్రా ఏర్పడ్డాక నిర్మించే అక్రమ కట్టడాలను తొలగిస్తాం
- ప్రతి ఒక్కరికీ చెరువు, నాలా హద్దులు తెలిశాయి
- వాల్యూయర్స్ సదస్సులో హైడ్రా కమిషనర్



సదస్సులో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అందరికీ సొంతిల్లు ఓ కల.. దానిని సాకారం చేయడంలో బ్యాంకర్ల పాత్ర కీలకమైనదని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ అన్నారు. ఇల్లు కొనేందుకు రుణాలిచ్చే ముందు అన్ని విధాలా సరి చూసుకోవాలని బ్యాంకర్లకు సూచించారు. 'ఐఒవి' (ఇనిస్టిట్యూషన్ ఆఫ్ వాల్యూయర్స్) రిజిస్టర్డ్ వాల్యూయర్స్ ఫౌండేషన్, హైదరాబాద్ బ్రాంచ్ ఆధ్వర్యంలో "ట్రాన్స్‌ఫర్‌మేటివ్ ఎరాలో వాల్యుయేషన్" అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సులో ఆయన ప్రసంగించారు. గతేడాది జులై 19న హైడ్రా ఏర్పడిందని, అంతకు ముందు వెలిసిన నివాస ప్రాంతాలతోపాటు అనుమతులు పొంది నిర్మాణ దశలో ఉన్న వాటి జోలికి వెళ్లబోమని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పాటైన తర్వాత అక్రమ కట్టడాలు వస్తే వాటిని తొలగిస్తామన్నారు. హైడ్రా అంటే కూల్చివేతలు కాదని.. పర్యావరణ హితమైన నగరాభివృద్ధికి దోహదం చేసే సంస్థగా అందరూ గుర్తిస్తున్నారన్నారు. సుస్థిర వ్యాపారానికి హైడ్రా దోహదం చేస్తోందని అందరూ గ్రహిస్తున్నారని తెలిపారు. ఎలాంటి మోసాలకూ ఆస్కారం లేకుండా సొంతింటి కలను సాకారం చేయడంలో రియల్ ఎస్టేట్ సంస్థలతో పాటు ఆ ఇంటికి రుణాలిచ్చే అర్థిక సంస్థలు కూడా బాధ్యత వహించాలని సూచించారు. సర్వే నంబరు ఒకటి చూపించి.. వేరే చోట ఇండ్ల నిర్మాణం చేపడుతున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సంబంధిత పేపర్లను పరిశీలించామనుకుంటే సరిపోదనీ, క్షేత్ర స్థాయిలో పరిశీలించాల్సిన బాధ్యత రుణాలు ఇచ్చిన సంస్థలపైనే ఉందన్నారు. ఆర్థిక సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వ సంస్థలకు ఆస్తి విలువలను నిర్ణయించడంలో పారదర్శకత, నమ్మకం, ఖచ్చితత్వాన్ని నిర్ధారించడంలో వాల్యుయేషన్ నిపుణుల పాత్ర చాలా కీలకమైనదన్నారు. నగరంలో గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి వరద ముప్పు లేకుండా హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలనేది హైడ్రా లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే చెరువుల, నాలాలు, పార్కులు, రహదారుల ఆక్రమణలను నిరోధించి, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడేందుకు హైడ్రా ప్రాధాన్యతనిస్తోందన్నారు. హైడ్రా వచ్చిన తర్వాత తీసుకున్న చర్యలతో ప్రతి ఒక్కరికీ చెరువు, నాలా హద్దులు తెలిశాయని చెప్పారు. ఇప్పుడు ఇల్లు కొనాలనుకునేవారు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని పరిశీలిస్తున్నారని తెలిపారు. బ్యాంకర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, వాల్యూయర్స్ సందేహాలను కమిషనర్ ఈ సందర్భంగా నివృత్తి చేశారు. ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్.రఘు, 'క్రెడియా' జాతీయ అధ్యక్షుడు జి.రామిరెడ్డి, ఐవోవీ జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.పటేల్, ఐవోవీ ప్రతినిధులు పి.మధు, కె.చిరంజీవితోపాటు, వాల్యుయేషన్, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకే హార్డ్‌డిస్క్‌లను మూసీలో వేశాం

- సిట్ విచారణలో మాజీ డిఎస్‌పి ప్రణీత్‌రావు వెల్లడి
- 23న తిరిగి ప్రభాకర్‌రావును విచారించనున్న సిట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించిన హార్డ్‌డిస్క్‌లు, ఇతర పరికరాలను ధ్వంసం చేసి మూసీ నదిలో వేశామనీ, ఇందుకు మాజీ ఒఎస్‌డి ప్రభాకర్‌రావు ఇచ్చిన ఆదేశాలే కారణమని ఎస్‌ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్‌రావు సిట్ విచారణలో వెల్లడించాడు. శనివారం ఫోన్‌ట్యాపింగ్ కేసులో నిందితుడైన ప్రణీత్‌రావును సిట్ అధికారులు ఐదు గంటల పాటు విచారించారు. ఎస్‌ఐబి కార్యాలయంలో జరిగిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారాలన్నీ అప్పటి తమ ఉన్నతాధికారి ప్రభాకర్‌రావుకు తెలుసని డిఎస్‌పి వివరించాడు. కొందరు ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల ఫోన్‌ట్యాపింగ్‌లు చేశారా? అని సిట్ ప్రశ్నించగా.. తాము ఏది చేసినా ఉన్నతాధికారుల ఆదేశాలతోనేనని ప్రణీత్‌రావు సమాధానమిచ్చాడు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వస్తున్న సందర్భంలోనే పైనుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఎస్‌ఐబిలోని ప్రత్యేక గదిలో ఉన్న ఫోన్‌ట్యాపింగ్ పరికరాలు, కంప్యూటర్ హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేయడం జరిగిందని ప్రణీత్‌రావు చెప్పినట్టు తెలిసింది. ప్రభాకర్‌రావుగాక మరెవరైనా అధికారపార్టీ రాజకీయ ప్రముఖులు ఫోన్‌ట్యాపింగ్ చేయాలని ఆదేశించేవారా? అనే ప్రశ్నకు.. తనకు ఎవరూ అలా చెప్పలేదని ప్రణీత్‌రావు అన్నట్టు సమాచారం. తాము ట్యాపింగ్ జరిపిన వివరాలను అదనపు ఎస్పీ బుజంగరావుకు అందజేసేవారమని మరో ప్రశ్నకు ప్రణీత్‌రావు సమాధానమిచ్చినట్టు తెలిసింది. మొత్తమ్మీద, ఐదు గంటల పాటు తాజాగా విచారించిన సిట్ అధికారులు సోమవారం అవసరమైతే పిలుస్తామని ప్రణీత్‌రావును పంపించివేసినట్టు సమాచారం. కాగా, ఈ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్‌ఐబి మాజీ ఒఎస్‌డి ప్రభాకర్‌రావును 23న తిరిగి విచారణకు హాజరు కావాలని సిట్ కోరినట్టు తెలిసింది.

ప్రయివేటీకరణతోనే ప్రమాదాలు

- కార్పొరేట్ కంపెనీలకు ఏజెంటుగా వ్యవహరిస్తున్న కేంద్రం
- టియుసిఐ జాతీయ అధ్యక్షులు అమ్రిష్ పటేల్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీల అధిపతులు అదానీ, అంబానీ, టాటాలకు ఏజెంట్‌గా వ్యవహరిస్తోందని, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణతోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని టియుసిఐ జాతీయ అధ్యక్షులు అమ్రిష్ పటేల్ అన్నారు. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ) రాష్ట్ర మహాసభ సందర్భంగా శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు వేలాది మంది కార్మికులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ అధ్యక్షత పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరిపారు. ఈ సందర్భంగా అమ్రిష్ పటేల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలన్నీ కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసేలా కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రయివేటీకరించి నిరుద్యోగం పెంచుతోందన్నారు. విమానాలు, విమానాశ్రయాలు, నౌకలు, నౌకాశ్రయాలు, రైళ్లు రైల్వేస్టేషన్లు అన్నీ ప్రయివేటు కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే తరచూ రైళ్ల ప్రమాదాలు, విమాన ప్రమాదాలు, ఓడల్లో మాదకద్రవ్యాల రవాణా ఘటనలు జరుగుతున్నాయన్నారు. కార్మిక హక్కులను కాలరాసే 4 లేబర్ కోడ్‌లను, పని గంటల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇతర కార్మిక సంఘాలతో ఐక్య కార్యాచరణగా ఏర్పడి కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడతామన్నారు.

టియుసిఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనాలు 26వేలు, కనీస పెన్షన్ 9వేలు అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంఘటిత, అసంఘటిత కార్మికులను మోసం చేస్తున్నాయన్నారు. ఈ సభలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.నరేందర్, ఎస్ఎల్ పద్మ, ఎం.హన్మేష్, సహాయ కార్యదర్శి కె.రాజన్న, జి.రామయ్య, సి.వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, రాష్ట్ర నాయకులు వెంకన్న, రాజేశ్వర్, ముత్తన్న మల్లేష్, యాకూబ్ షావలి, వెంకట్‌రెడ్డి, అశోక్, సాంబశివుడు, కిరణ్, ప్రసాద్, హనుమంతు, రాజు మరియు ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒరిషా, కేరళ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల ప్రతినిధులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించాలి

- విద్యాకమిషన్‌కు టిజిజెఎల్ఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థులపై మానసిక, ఆర్థిక ఒత్తిడిని తగ్గించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ (టిజిజెఎల్ఎ-475) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళిని శనివారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో జెఎన్‌టియుహెచ్, ఇంటర్ బోర్డు అధికారులు, తల్లిదండ్రులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొని రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థులు పోటీ పరీక్షలకు సంబంధించిన మానసిక, ఆర్థిక ఇబ్బందుల గురించి చర్చించారని తెలిపారు. జెఇఇ, నీట్, ఎప్‌సెట్ కోచింగ్‌ల పేరుతో కార్పొరేట్ కళాశాలలు, మెడికల్ అకాడమి పేరుతో వివిధ సంస్థలు విపరీతమైన ఫీజులను వసూలు చేస్తున్నాయని తెలిపారు. వాటిపై ప్రభుత్వ నియంత్రణ లేదని పేర్కొన్నారు. ఈ విషయాలను పరిశీలించి రాష్ట్రంలోని ఇంటర్ విద్యార్థులపై మానసిక, ఆర్థిక ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిషన్ సభ్యులు పిఎల్ విశ్వేశ్వరరావు, జ్యోత్స్న రెడ్డి, చారకొండ వెంకటేష్, జేఎన్టీయూహెచ్ అధికారులు, ఇంటర్ విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటయ్య, అధ్యాపకులు కే విజయలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు తరపున అత్తినేని శ్రీనివాస్, జి విశాలాక్ష్మి మొదలైన వారు పాల్గొన్నారు.

కొత్త డ్రామా ఆపండి

- బిఆర్ఎస్ నేతలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కౌంటర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వానాకాలానికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేయగానే బిఆర్ఎస్ నాయకులు కొత్త డ్రామా మొదలు పెట్టారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల సాగులో ఉన్న భూములను గుర్తించి, వాటికే రైతుభరోసా నిధులు చెల్లిస్తామని స్పష్టం చేశారు. రియల్ ఎస్టేట్ భూములకు రైతు భరోసా ఇవ్వబోమని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మంచి ఉద్దేశంతో చేపట్టిన పథకాలను రాజకీయం చేసిన ఘనత బిఆర్ఎస్ నాయకులకే చెల్లిందని విమర్శించారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా కేవలం ఆరు రోజుల్లోనే రైతు భరోసా సాయం కింద రూ.7,770.83 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. ఆ ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 2.18 లక్షల ఎకరాల్లో దాదాపు 93వేల ఎకరాల వరకు రియల్ ఎస్టేట్ వెంచర్లు, సాగుకు అనువుకాని భూములను గుర్తించామన్నారు. వీటికి తప్ప సాగులో ఉన్న మిగతా 1.20 లక్షల ఎకరాల భూమికి రైతుభరోసా పథకాన్ని వర్తింపచేస్తామన్నారు.

ఆర్‌టిసి పరిరక్షణ, కార్మిక చట్టాల కోసం పోరాటాలు

- జులై 9న జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి
- ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య
- ఖమ్మంలో ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర 4వ మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా రవాణా రంగాన్ని, కార్మిక చట్టాలను కాపాడుకోవడం కోసం ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఆ దిశగా రూపకల్పన చేసే విధంగా స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర 4వ మహాసభలో చర్చలు జరగాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, కార్మిక సమస్యలను పరిష్కరించే కార్యక్రమాలకు సంబంధించిన తీర్మానాలు మహాసభలో ఆమోదం పొందాలని, తెలంగాణ ఆర్‌టిసి కార్మికవర్గానికి మహాసభ ఐక్యపోరాటాల సందేశం అందించాలని అన్నారు. శనివారం ఖమ్మంలోని నేపాల్ దేవ్ భట్టాచార్య నగర్, యర్రా శ్రీకాంత్ ప్రాంగణం (ఐఎంఎ హాల్)లో వీరాంజనేయులు అధ్యక్షతన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర 4వ మహాసభ ప్రారంభ సూచికంగా రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు అరుణారుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ప్రతినిధులందరూ అమరవీరుల స్థూపానికి నివాళు లర్పించారు. అనంతరం ప్రారంభ సభలో ఎస్‌డబ్ల్యూఎఫ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి ప్రతినిధులను వేదికపైకి ఆహ్వానించారు. నేపాల్ దేవ్ భట్టాచార్య, యర్రా శ్రీకాంత్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ.. 2019 మోటారు వాహనాల చట్టం సవరణలతో కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా దేశంలో ఉన్న ఆర్‌టిసిలకు సమాధి కట్టే విధానాలు చేసిందన్నారు. అక్రమ రవాణాను సక్రమ రవాణాగా చేసే విధానాలు అవలంబిస్తోందని విమర్శించారు. ఎలక్ట్రికల్ బస్సుల పేరుతో ప్రయివేట్ ఆపరేటర్లను, అగ్రిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ పాలసీ పేరుతో ఉబర్, ఓలా లాంటి సంస్థలతో పాటు, బహుళ జాతి రవాణా సంస్థలు కూడా భారత రవాణా రంగంలో చొరబడ్డాయన్నారు. దేశంలో రైతు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం విజయం సాధించినట్టుగా, కార్మిక వర్గం కూడా తమకు నష్టదాయకమైన లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకూ సమరశీల పోరాటాలు నిర్వహించాలన్నారు. జులై 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికవర్గం మొత్తం పాల్గొనాలన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అశ్వద్ధామరెడ్డి మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ఐక్యం కావాల్సిన అవసరం ఉందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజా రవాణా రంగం అభివృద్ధిలో వెనుకపడ్డామని, రాష్ట్రంలో దాదాపు 500 గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సౌకర్యమే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత నిర్బంధం మధ్య 55 రోజుల సమ్మె పోరాటం చేశామని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలను పరిష్కరించడం లేదన్నారు. అందరం కలిసి గరిష్ట ఐక్యతను ప్రదర్శిద్దాం.. పోరాడి విజయాలు సాధిద్దామని పిలుపునిచ్చారు. ఎంప్లాయీస్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు తీర్మానాన్ని బలపరుస్తూ "కార్మికవర్గ ప్రయోజనాలే ఏకైక లక్ష్యంగా విశాల ఐక్యతతో ముందుకు సాగుదాం" అన్నారు.

తెలంగాణ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు థామస్‌రెడ్డి తీర్మానాన్ని బలపరుస్తూ ఆర్టీసీలో ఎస్‌డబ్ల్యూఎఫ్ అంటే సిద్ధాంతం, నిబద్ధత కలిగిన సంఘం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ రవాణా విధానం ప్రవేశపెట్టినా అది తెలంగాణలో అమలవుతుందని, తెలంగాణ ఆర్టీసీ కార్మిక వర్గం ఇబ్బందికర పరిస్థితుల్లో ఉందని, విశాల ఐక్యతతో ఉమ్మడి ఎజెండాతో ఐక్యంగా ముందడుగు వేద్దామన్నారు.

స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బత్తినేని హనుమంతరావు తీర్మానాన్ని బలపరుస్తూ.. ఆర్‌టిసి కార్మికులకు నిత్య చైతన్యం అందించే పోరాటాల సంఘం స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 4వ మహాసభ ఖమ్మంలో జరగటం సంతోషకరమని అన్నారు. ఆహ్వాన సంఘం తరపున గుండు మాధవరావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు, సిఐటియు తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు కళ్యాణం వెంకటేశ్వరరావు, ఎఐఆర్ టీడబ్ల్యూఎఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్, ఎపి ఎస్‌డబ్ల్యూఎఫ్ అధ్యక్షులు సిహెచ్. సుందరయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ పూర్వ అధ్యక్షులు ఎస్.వీరయ్య, పూర్వ కార్యదర్శులు వి.రాములు, ఎంపిఎస్ నారాయణ, ఉప ప్రధాన కార్యదర్శి గడ్డం లింగమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా పద్మావతి, ప్రచార కార్యదర్శి పి.రవీందర్ రెడ్డి, నాయకులు భిక్షపతి గౌడ్, బత్తుల సుధాకర్, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టల సుధాకర్, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.విక్రం, ప్రధాన కార్యదర్శి జిల్లా ఉపేందర్, ఆహ్వాన సంఘం కోశాధికారి గుగ్గిళ్ల రోశయ్య పాల్గొన్నారు.

అబద్ధాల ముఖ్యమంత్రి

- పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు రైతు భరోసా ఇవ్వాలి: మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అబద్ధాల ముఖ్యమంత్రి రేవంత్ అని, ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు.. కోతల రేవంత్ రెడ్డి అంటూ సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు రైతు భరోసా ఇవ్వాలంటూ బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం జిన్నారం మండల కేంద్రంలో మహాధర్నా నిర్వహించారు. ధర్నాలో హరీశ్‌రావ్‌తోపాటు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, వాకిట సునీత లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల రైతులకు వెంటనే రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల రైతాంగానికి రైతు భరోసా కోత ఎదురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 22 వేల మంది ఔటర్ రింగ్ రోడ్ రైతాంగానికి భరోసాగా భారీ స్థాయిలో వంటావార్పు కార్యక్రమాలతో పోరాటం చేస్తామన్నారు. రైతు భరోసా అందకుంటే త్వరలో కలెక్టరేట్‌ను ముట్టడిద్దామంటూ రైతాంగానికి పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు అరచేతిలో వైకుంఠం చందంగా మారిందన్నారు. రుణమాఫీ పేరుతో రైతులను నిండా ముంచిందన్నారు. లక్ష మందికి పింఛన్లు కోత పెట్టారన్నారు. రైతుబంధు నేడు నాట్లకు కాదు ఓట్లకు అన్న చందంగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో కేడీల, బేడీల రాజ్యంగా మారిందని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో రాష్ట్రంలో జరిగిన మంచి పని ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. నేను పొడవు ఉన్నా, నాకు జ్వరం వచ్చినా సీఎంకు ఏడుపేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టు దుర్మార్గమైందని, నాన్ బెయిలబుల్ కేసులు హేయనీయమని హరీశ్‌రావు అన్నారు. ఈ మహాధర్నాలో డీసీఎంఎస్ చైర్మెన్ మల్కాపురం శివకుమార్, మఠం భిక్షపతి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, జిన్నారం వెంకటేశంగౌడ్, రాజేష్‌గౌడ్, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, తెల్లాపూర్ మాజీ వైస్ చైర్మెన్ రాములు గౌడ్, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రప్పా.. రప్పా..3.0.. ప్లకార్డులు

ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొన్న ఈ మహాధర్నాలో "రప్పా.. రప్పా.." అనే నినాదంతో ప్లకార్డులు వెలిశాయి.. ఈ పదంతో ఎపిలో దుమారం రేగుతుండగా.. అది తెలంగాణకు పాకడం, హరీశ్ పాల్గొన్న ధర్నాలో చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది.



సదస్సులో మాట్లాడుతున్న విసి చక్రపాణి

సాహిత్య ధిక్కార స్వరాలు 'దాశరథి- ఆరుద్ర'

- సాహిత్యం విశ్వజనమని చాటేలా జాతీయ సదస్సు
- అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక పరిణామాలు.. స్వాతంత్ర్యానంతరం దేశంలో మార్పుల ఆధారంగా సాహిత్య రచనల ద్వారా ధిక్కార స్వరాన్ని వినిపించిన కవులు దాశరథి కృష్ణమాచార్య - భాగవతుల సదాశివ శంకర శాస్త్రి (ఆరుద్ర) అని డాక్టర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. దాశరథి తెలంగాణ జీవన స్వరమని చెప్పారు. ఖమ్మం ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ప్రిన్సిపల్ డాక్టర్ మొహ్మద్ జకీరుల్లా అధ్యక్షతన 'శతజయంతి సాహితీ మూర్తులు దాశరథి -ఆరుద్ర జీవితం- సాహిత్యం'పై రెండురోజుల జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ముగింపు సభలో చక్రపాణి మాట్లాడుతూ.. ఖమ్మానికి దాశరథికి విడదీయరాని బంధం ఉందన్నారు. ఆయన పాదముద్రలు పడిన ఖమ్మంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ప్రతిష్టాత్మకంగా దాశరథి- ఆరుద్ర శతజయంతి సదస్సు నిర్వహించటం అభినందనీయమన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో దాశరథి సాహిత్యం, పాటలు ఉత్తేజాన్ని, స్ఫూర్తిని కలిగించాయన్నారు. ఆరుద్ర గొప్ప పరిశోధకుడిగా కవిత్వంలో ప్రయోగ వాదిగా నిలిచారన్నారు. కూనలమ్మ పదాలు రాసిన ఆధునీకుడిగా అభివర్ణించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో తెలంగాణ దీర్ఘ కావ్యం, త్వమేవాహం రాశారన్నారు.

బడుగుల కన్నీళ్ళ అక్షరబద్ధం

నిజాం నిరంకుశ పాలనలోని బడుగుల కన్నీళ్లను అక్షరబద్ధం చేసిన కవి దాశరథి అని సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. స్వీయ అనుభవాలు, సామాజిక పరిణామాలు ఆయన ప్రతి రచనలోనూ కనబడతాయని తెలిపారు. ఖమ్మం సాహిత్య గుమ్మమని కళాశాల తెలుగు విభాగం నిరూపించిందని తెలంగాణ ప్రెస్ అకాడమీ పూర్వ చైర్మెన్ అల్లం నారాయణ అన్నారు. ఇరువురు కవులు అనుభవం, అధ్యయనం ద్వారా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని తెలిపారు. ఈ సదస్సును చరిత్ర పుటల్లో నిలిచే స్థాయిలో నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. ఈతరం విద్యార్థులు దాశరథి, ఆరుద్ర సాహిత్య సారాంశాన్ని జిజ్ఞాసతో అధ్యయనం చేయాలని పూర్వ బిసి కమిషన్ సభ్యులు జూలూరి గౌరీశంకర్ సూచించారు. దాశరథి అంటే తెలంగాణ అగ్నిధారగా నిలిచిన మహాకవి అన్నారు. దాశరథి తెలంగాణకు సాహిత్య దీపదారిగా.. తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపారని సాహిత్య విశ్లేషకులు ఎన్.వేణుగోపాల్ చెప్పారు. స్వామి రామానంద తీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్ చైర్మెన్ ఎన్.కిషోర్ రెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ హిస్టరీ ప్రొఫెసర్ భూక్యా భాంగ్యా సదస్సు నిర్వహించిన తీరు స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. కన్వీనర్, తెలుగు విభాగాధిపతి డా.పి.రవికుమార్ సదస్సు నివేదికను సమర్పిస్తూ రెండు రాష్ట్రాల విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు 75 పరిశోధనాపత్రాలు సమర్పించారని వివరించారు. ముగింపు సమావేశ సమన్వయ కర్త, సదస్సు రూపశిల్పి, కాళోజీ అవార్డు గ్రహీత డా.సీతారాం అతిథులకు స్వాగతం పలికారు. సదస్సు ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ బాడీ సభ్యులు రవిమారుత్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులు, పేదలకు రక్షణ లేదు

- ఉపాధి హామీకి నిధుల కోత..
- వ్యకాస అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ ఆర్థిక విధానాల వల్ల, వారి పాలనలో వ్యవసాయ కార్మికులు, పేదలు, కౌలు రైతులకు రక్షణ లేకుండా పోయిందని, ఈ కాలంలో 60 వేల మంది ఆత్మహత్య చేసుకున్నారని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. ఉపాధి హామీకి నిధులు కోతపెట్టి కార్పొరేట్ శక్తులకు మాత్రం పెద్దఎత్తున సబ్సిడీలు ప్రకటించారని విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్‌లో మాజీ వ్యకాస జిల్లా అధ్యక్షులు వేముల మహేందర్ 4వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన "వ్యవసాయ కార్మికులు, ఉపాధి - పాలకుల వైఖరి"పై నిర్వహించిన సదస్సులో వెంకట్ మాట్లాడుతూ.. ఆరోగ్యం బాగుండాలంటే యోగ ఒక్కటే కాదని.. ప్రజలందరికీ తినడానికి పౌష్టికాహారం ఉండాలని, ప్రభుత్వం పౌష్టికాహారమందించాలని డిమాండ్ చేశారు. వామపక్షాల పోరాట ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని చెప్పారు. ప్రధాని మోడీ విధానాల వల్ల భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, లౌకిక తత్వానికి ప్రమాదం ఏర్పడిందని అన్నారు. వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోటీ 50 లక్షల ఎకరాల మిగులు భూములు ఉన్నాయని, ఆ భూములన్నింటినీ భూమి లేని ప్రతి పేద కుటుంబానికీ రెండు ఎకరాల చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కోనేరు రంగారావు భూ సిఫారసులను అమలు చేసి పేదలకు ప్రభుత్వ భూములను పంచాలన్నారు. వ్యకాస జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్య, బిఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందడి సత్తిరెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న వ్యకాస అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్

యోగాతో ఆరోగ్యం, ఆనందం

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిత్య జీవితంలో యోగా ప్రాధాన్యతను అందరూ గుర్తించాలని, యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపర్చుకోవచ్చని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్.. 'ప్రతి ఒక్కరు యోగా నిత్య సాధనతో ఆరోగ్యం, ఆనందం పొందాలని' అన్నారు. రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ..'యోగా కేవలం వ్యాయామం కాదు. ఆరోగ్య సమస్యలు దూరం చేసుకునేందుకు ఇదో ఉత్తమ పరిష్కారం. యోగాభ్యాసంతో విద్యార్థులలో ఒత్తిడిని తొలగించవచ్చు. ప్రతి పాఠశాలలోనూ యోగా తరగతులు నిర్వహించాలి. యోగాను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని' తెలిపారు. క్రీడలు, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తూ, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్జ్) చైర్మెన్ కే. శివసేన రెడ్డి, పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 10,725 భూ సదస్సులు

- 8.58 లక్షల దరఖాస్తుల స్వీకరణ
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించామనీ, ఇందులో 8.58 లక్షల దరఖాస్తులు వచ్చాయని ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 14న భూభారతి చట్టాన్ని ఆవిష్కరించుకుని, దశల వారీగా అమల్లోకి తీసుకురావడం జరిగిందని చెప్పారు. మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి 30 వరకు 4 మండలాల్లో నిర్వహించిన 72 రెవెన్యూ సదస్సుల్లో 12 వేల దరఖాస్తులు, రెండవ దశలో మే 5 నుంచి 28 మండలాల్లో నిర్వహించిన 414 సదస్సుల్లో 46 వేల దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు 561 మండలాల్లో 10,239 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించామనీ, ఇందులో భూ సమస్యలకు సంబంధించి 8 లక్షల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67 వేలు, భద్రాద్రి కొత్తగూడెంలో 61 వేలు, వరంగల్‌లో 54 వేలు, జయశంకర్ భూపాలపల్లిలో 48 వేలు, నల్లగొండలో 42 వేల దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులు ఇచ్చామనీ, ఎమ్మార్వోల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారని వివరించారు. స్వీకరించిన వాటికి రశీదులు అందజేయడం జరిగిందనీ, వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్టు తెలిపారు. మిగతా దరఖాస్తులను త్వరలో ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్టు పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు

- బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి చిల్లర మాటలు మాట్లాడుతున్నారని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావుతో పాటు బిఆర్ఎస్ నేతలపై సిఎం నరనరాన విషం నింపుకున్నారని ధ్వజమెత్తారు. తన గురువు చంద్రబాబు కోసం గోదావరి, కృష్ణా జలాలను ఎపికి తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. రేవంత్ వ్యవహారశైలి తెలంగాణకు శాపంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. "కెసిఆర్ హయంలోనే తెలంగాణలోని 86 శాతం భూమి సాగు యోగ్యంగాగా మారింది. రేవంత్ హయంలో 2 శాతం తగ్గింది. గోదావరి జలాలను వాడుకుని తెలంగాణను సస్యశ్యామలం చేశాక రాయలసీమకు నీళ్లివ్వాలని కెసిఆర్ అన్నారు. అపెక్స్ కౌన్సిల్‌లో చేసిన వాదనలు రేవంత్ తప్పుగా ప్రచారం చేస్తున్నారు.

అధిక రాబడి పేరుతో మోసం

- ఎవి ఇన్ఫ్రా పేరిట రూ.500 కోట్ల స్కాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధిక రాబడి పేరుతో ఓ కంపెనీ భారీ మోసానికి పాల్పడింది. జనం నుంచి రూ.500 కోట్ల వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. దీనిపై బాధితులు శనివారం సైబరాబాద్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేయడంలో ఈ ఉదాంతం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎవి ఇన్ఫ్రా పేరిట రాయదుర్గం పరిధిలో కంపెనీని ఏర్పాటు చేశారు. మాదాపూర్ కేంద్రంగా బై బ్యాక్ పేరుతో ఎవి ఇన్ఫ్రా చైర్మన్ విజయ్ గోగుల బాధితుల నుంచి డబ్బులు వసూలు చేశారు. తన కంపెనీలో పెట్టుబడి పెట్టిన వారికి డబుల్ అమౌంట్ ఇస్తామని ఆశ చూపాడు. డబ్బులు ఇవ్వకపోతే భూమి రిజిస్ట్రేషన్ చేస్తామని హామీ ఇచ్చాడు. నారాయణఖేడ్, యాదగిరిగుట్ట తదితర ప్రాంతాల్లో వెంచర్లు ఉన్నాయంటూ నమ్మబలికాడు. 18 నెలలకు 50 శాతం అదనంగా ఇస్తానని చెప్పి సుమారు రూ.500 కోట్ల వరకు 500 మంది బాధితుల నుంచి వసూలు చేశాడు. ఓ బాధితుడు ఒక్కడే సుమారు రూ.84 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. గడువు ముగియడంతో విజయ్‌ని బాధితులు డబ్బులు అడిగారు. అయితే, ఇంకో ప్రాజెక్ట్ ఉందని.. అక్కడ డబ్బులు సమకూర్చుతానని వారిని నమ్మించే ప్రయత్నం చేశాడు. కానీ అక్కడ కూడా బాధితులకు డబ్బులు ఇవ్వలేదు. బాధితులు నిలదీయడంతో బ్లాంక్ చెక్కులు ఇస్తూ తప్పించుకుంటున్నాడు. తాము మోసపోయామని గ్రహించిన బాధితులు సైబరాబాద్ కమిషనరేట్‌లో ఫిర్యాదు చేశారు.

కంట్లోకి దిగిన కత్తి తొలగింపు

ప్రాణం కాపాడిన కోఠి ఇఎన్‌టి వైద్యులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ వ్యక్తి కంటిలో నుంచి ముక్కులోకి దిగిన కత్తిని హైదరాబాద్ కోఠి ఇఎన్‌టి ప్రభుత్వాస్పత్రి వైద్యులు అధునాతన శాస్త్ర చికిత్స ద్వారా తొలగించి అతని ప్రాణం కాపాడారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ ఆచార్య తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిగి మండలం రాపోలే గ్రామంలో ఈ నెల 10న రాత్రి 2 గంటలకు గాండు రాజేందర్ ఇంట్లోకి చొరబడిన ఓ వ్యక్తి అతని కంట్లో కత్తి గుచ్చాడు.



కుటుంబ సభ్యులు వెంటనే ఆయన్ను సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు సరోజినీ దేవి కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. అక్కడ పరీక్షించిన వైద్యులు కత్తి కంట్లో నుంచి ముక్కులోకి దిగిందని గుర్తించి ఈ నెల 18న కోఠిలోని ఇఎన్‌టి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు ఆయనకు 19న ఉదయం 9 గంటలకు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించారు. కత్తిని తొలగించి రాజేందర్ ప్రాణం కాపాడారు. ఆయన పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపారు. ఆపరేషన్ అనంతరం రాజేందర్‌ను సరోజినీ కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ ఆపరేషన్‌లో ఇఎన్‌టి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్ ఆచార్య, సరోజినీ దేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదిని, అనస్థీషియా డాక్టర్ రవి, వైద్యులు ఉమా, ప్రదీప్, నిఖిల, సౌజన్య, నిహారిక, స్వామి, నర్సింగ్ ఆఫీసర్‌లు అంజలి, టెక్నీషియన్‌లు అమీర్, బాలరాజు, పీజీ వైద్యులు పాల్గొన్నారు.

రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అరెస్టు

- మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూధనా చారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయ దురుద్దేశంతోనే హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేశారని శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ప్రజల తరపున ప్రశ్నిస్తున్న కౌశిక్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేయటమేంటని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే కౌశిక్ రెడ్డి పై ఎన్నో అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే శని, ఆదివారాల్లో ఆయన్ను అరెస్టు చేయించిందని ఆరోపించారు. రెండు రోజులైనా జైల్లో పెట్టాలనే ఉద్దేశంతో కుట్ర చేశారన్నారు. అక్రమ కేసులను న్యాయ పోరాటం ద్వారా ఎదుర్కుంటామని చెప్పారు. రేవంత్ సర్కారుకు హామీల అమలు చేతకాక అక్రమ అరెస్టులకు దిగుతున్నదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తా

- సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ, వికలాంగుల సంక్షేమానికి సంబంధించిన ఫైళ్లపై అడ్లూరి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగుల స్వయం ఉపాధి యూనిట్లకు రూ.5 కోట్లు మంజూరు చేశామన్నారు. వికలాంగుల స్వయం సహాయక సంఘాలకు రూ.3.55కోట్ల రివాల్వింగ్ ఫండ్ విడుదలకు ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి కింద ఎస్సీ లబ్ధిదారుల సంఖ్యను 210 నుంచి 500కి పెంచామన్నారు. గిరిజన విద్యా సంస్థల మరమ్మతులకు రూ.79.61కోట్లు, గిరిజన మినీ గురుకులాల నిర్వహణకు రూ.17.18 కోట్లు, మేడారం జాతర మిగిలిన పనులకు రూ.44.5కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. జేఈఈ, నీట్‌లో ప్రతిభ కనబరిచిన 100 మంది గిరిజన విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు. అనంతరం గౌలిదొడ్డి సంక్షేమ కళాశాల, పాఠశాలకు వెళ్లిన మంత్రి అక్కడి స్థితిగతులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, టిజిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ కార్యదర్శి అలగు వర్షిణిలతో కలిసి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. విద్యార్థులకు ఇచ్చిన స్మార్ట్ కార్డుల ద్వారా ఫోన్ కాల్స్ విధానాన్ని పరిశీలించి స్వయంగా ఒక విద్యార్థిని చేత వాళ్ళ కుటుంబ సభ్యులకు ఫోన్ చేయించారు. మంత్రి కుడా ఆ అమ్మాయి తల్లితండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసం కట్టుబడి పని చేస్తామని తెలిపారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్ కృష్ణయ్య
- ధర్నాచౌక్ వద్ద అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.రాజేందర్ అధ్యక్షతన శనివారం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో లక్షలాది మంది ఉద్యోగులు 20-25 సంవత్సరాల నుంచి పని చేస్తున్నా ఉద్యోగ భద్రత, సరైన వేతనాలు లేవన్నారు. వారిని పర్మినెంట్ చేయడం లేదన్నారు. పైగా నెల నెలా సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐకార్ పరిశోధన సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను రూ.10 వేల నుంచి రూ.25 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వీరు 20-25 ఏండ్ల నుంచి పనిచేస్తున్నారని, దశల వారీగా రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ శాఖల్లో 2 లక్షల 50 వేల అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఏళ్ల తరబడి పని చేస్తున్నా తక్కువ వేతనాలు ఉన్నాయని, అవి కూడా సక్రమంగా చెల్లించడం లేదని అన్నారు. వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని చెప్పినా.. అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 240 రోజులు రెగ్యులర్‌గా పనిచేసిన వారిని పర్మినెంట్ చేయాలని రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులు చెప్పిందని గుర్తు చేశారు. కానీ, తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయడం లేదన్నారు. పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు, కేరళ, ఒరిషా, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాలు కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేశాయని చెప్పారు. ఈ ధర్నాలో బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు అనంతయ్య, విద్యార్థి సంఘం కన్వీనర్ మోది రాందేవ్, బాలస్వామి, రాజు నేత పాల్గొన్నారు.

నల్లగొండలో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివాహేతర సంబంధం ఓ యువకుడి ప్రాణం తీసింది. యువకుడి కళ్లల్లో కారం చల్లి.. చెట్టుకు కట్టేసి.. మర్మాంగాలపై రక్తం వచ్చేలా కొట్టి.. చాతిపై పిడిగుద్దులు గుద్ది.. కాళ్లు విరగ్గొట్టిన విషాదకర ఘటన నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని నోముల గ్రామంలో జరిగింది. బంధువులు, గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సింగ్ జానయ్య(34) వృత్తిరీత్యా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ తన తల్లితో కలిసి గ్రామంలో నివాసముంటున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో ఏనిమిదేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగుతుంది. ఈ క్రమంలో పలుమార్లు గొడవలు జరిగి పోలీస్ స్టేషన్ వరకు పంచాయితీ వెళ్లగా పెద్దల సమక్షంలో మాట్లాడి పంపించారు.

ఇదే విషయంపై గతేడాది సదరు మహిళ భర్త నాగరాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా జానయ్య అరెస్టై జైలుకు వెళ్లాడు. ఇటీవల బెయిల్‌పై బయటకొచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం నాగరాజు లేని సమయంలో ఇంటికి వెళ్లగా ఆమెతో వాగ్వివాదం జరిగింది. ఆమె కూతురు వెంటనే నాగరాజుకు ఫోన్ చేయడంతో ఆయన ఆవేశంతో ఇంటికి వచ్చి జానయ్యను చితకబాదాడు. మర్మాంగాలపై, చాతిపై పిడుగుద్దులు గుద్ది ఇంటి ముందు చెట్టుకు కట్టేశారు. కళ్లల్లో కారం కొట్టి శరీర భాగాలను చెక్కిన ఆనవాళ్లు ఉన్నాయి. మర్మాంగాలపై కొట్టి రక్తం కారుతూ స్పృహ కోల్పోయే వరకు చితక్కొట్టారు. ఈ ఘటన గ్రామంలో భయాందోళనకు గురిచేసింది. గ్రామస్తులు ఈ విషయాన్ని యువకుని బంధువులకు చెప్పడంతో వారు వచ్చి చెట్టు కట్టేసిన జానయ్యను విడిపించారు. అంబులెన్సులో నకిరేకల్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి పరిస్థితి విషమంగా ఉండటంతో నల్లగొండ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సాయంత్రం జానయ్యను నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించడంతో అక్కడే చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు నకిరేకల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. మృతదేహాన్ని శనివారం గ్రామానికి తరలించారు. కాగా నిందితులు ధనమ్మ, నాగరాజు నల్లగొండ డీఎస్పీ కార్యాలయంలో లొంగిపోయినట్టు సమాచారం. అన్ని కోణాల్లోనూ విచారణ చేసి పూర్తి వివరాలను త్వరలో వెల్లడిస్తామని సీఐ తెలిపారు.